క్లుప్తంగా

తెల్లరాయి తవ్వకాల అడ్డగింత


తవ్వకాలను అడ్డుకుంటున్న స్థానికులు

మర్రిపాడు: మండలంలోని చిలకపాడు రెవెన్యూ పరిధిలో జరుగుతున్న తెల్లరాయి అక్రమ తవ్వకాలను స్థానికులు శనివారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో భారీ యంత్రాలతో చేస్తున్న తెల్లరాయి తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు. తెల్లరాయి కోసం ఆక్రమణదారులు ప్రభుత్వ భూముల్లో 15 చోట్ల బోర్లను వేయడంతో అటుగా వెళ్లిన పశువుల కాపర్లు, పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తెల్లరాయి అక్రమ తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయండి


రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

చేజర్ల: జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ కృష్ణ సూచించారు. శనివారం మండలంలోని ఏటూరు సచివాలయంలో జరుగుతున్న జగనన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోల సమన్వయంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. లబ్ధి దారులకు ఇబ్బంది కలిగించకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీకాంత్, వీఆర్వో మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

మర్రిపాడు: విశాఖపట్నంలో తహసీల్దారు రమణయ్యను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ మర్రిపాడు తహసీల్దారు ఆనందరావు ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రజలకు సేవలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజనం రుచి చూడండి


భోజనం రుచిచూస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ముందుగా రుచి చూడాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు సూచించారు. ఆయన శనివారం పట్టణంలోని బీసీ కాలనీ తెలుగు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభ రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. విద్యతో పాటు వారికి క్రమశిక్షణ నేర్పించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలందించారు. ఆయన వెంట హెచ్ఎం నాగయ్య ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కావలి ఎమ్మెల్యే



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ హరినారాయణన్‌ను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్‌కు తెలియజేసి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

మహిళా సాధికారతే జగనన్న ధ్యేయం

• సమన్వయకర్త మేకపాటి

వరికుంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారతే ధ్యేయంగా పని చేస్తోందని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ చేశారు. తొలుత పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజా సంకల్పయాత్రలో పొదుపు మహిళలకు ఇచ్చిన మాటను నెరవేర్చి తన హామీని నిలబెట్టుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆసరా పథకం ద్వారా మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. కరోనా సమయంలో జగనన్న ప్రజలకు అండగా నిలబడి సేవలందించారన్నారు. ఆయనే సీఎంగా లేకపోతే ఎంతో ప్రాణనష్టం జరిగి ఉండేదన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే.. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చికిత్సలను చేర్చడంతో పాటు వైద్య ఖర్చులు రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి పథకం ప్రజలకు అందుతోందన్నారు. ప్రతి పథకంలోనూ మహిళలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రూ.3 వేలు అందించే పింఛన్ ద్వారా అవ్వాతాతలు తమ అవసరాలను తీర్చుకుంటున్నారన్నారు. పేదల పక్షాన నిలిచే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనన్నారు. ప్రతి పేద విద్యార్థికి ఆంగ్ల విద్యనందించాలనే ఉద్దేశంతో మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో సైతం ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు చేశారన్నారు. మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత తదితర పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు.


పొదుపు మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. ప్రతి గ్రామంలో కోట్ల రూపాయల అభివృద్ధి జగనన్న ప్రభుత్వ పాలనలోనే జరిగిందన్నారు. చంద్రబాబు 600 అబద్ధాలు చెప్పి అధికారం చేపట్టి మహిళలను నిలువునా మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను ప్రవేశ పెట్టి సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారన్నారు. ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలన్నారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని 475 స్వయం సహాయ సంఘాలకు రూ.3.36 కోట్లు చొప్పున పొదుపు మహిళలకు నగదు చెక్కు అందజేశారు. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఏపీఎం వైనారూత్, సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, సచివాలయ కన్వీనరు ఆర్.మధుసూదన్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, మండల కో ఆప్షన్ సభ్యుడు జిలానీబాషా, నాయకులు ఎం.తిరుపతినాయుడు, బి.మురళి, డి.ఎర్రాఓబయ్య, డి.వెంకట నారాయణ రెడ్డి, పి.మల్లికార్జున, డి.విజయమ్మ, డి.కొండమ్మ, సర్పంచ్ పాల్గొన్నారు.


జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు, సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

యువత భవిష్యత్‌కే ఆడుదాం ఆంధ్రా పోటీలు

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా యువత భవిష్యత్‌కు ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నారని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మండల స్థాయి విజేతలకు ఆయన శనివారం వరికుంటపాడు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నగదు బహుమతులు అందజేశారు. రాజారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు నా కుమారుడు మేకపాటి అభినవ్‌రెడ్డి తన సొంత నిధులు ప్రతి మండలానికి రూ.75 వేలు వంతున విన్నర్, రన్నర్‌కు అందించేందుకు ముందుకొచ్చారన్నారు. ఆ నగదు చెక్కును పంపిణీ చేశారు. యువత అన్ని రంగాల్లో ముందుకొచ్చి వారిలోని ప్రతిభను పది మందికి తెలిసేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, సొసైటీ అధ్యక్షుడు రామాంజనేయులు, సొసైటీ డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎం.తిరుపతినాయుడు, బి.మురళి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


నగదు బహుమతిని క్రీడాకారులకు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలి


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

వరికుంటపాడు: మండలంలో శనగపంట సాగు చేసే రైతులు తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ రవికుమార్ తెలిపారు. ఆయన శనివారం వరికుంటపాడులో సాగులో ఉన్న పలు పంటలను వీఏఏ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించి రైతులకు సూచనలందించారు. ఆయన మాట్లాడుతూ శనగ పంటలో ఉప్ప తెగులు సోకుతుందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి పూట చలి వాతావరణం వల్ల ఈ తెగులు సోకే ప్రమాదముందన్నారు.

కమిషనర్‌ను కలిసిన మహిళా కౌన్సిలర్లు


ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న మహిళా కౌన్సిలర్లు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన షేక్ ఫజులుల్లాను వైఎస్సార్‌సీపీ మహిళా కౌన్సిలర్లు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి అభినందించారు. కమిషనర్ ఫజులుల్లా మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి అందరం సమష్టిగా కలిసి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఖాసీం, కౌన్సిలర్లు నౌషాద్‌బేగం, పుచ్చలపల్లి రాధిక, కొప్పోలు రమాదేవి, గుడి సంధ్య, తోకల తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై హత్య



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కోటారెడ్డి

• నిందితుడి అరెస్ట్

సంగం : వ్యసనాలకు బానిసైన అన్సర్‌బాషా ఎలాగైనా తాను చేసిన అప్పుల నుంచి బయటపడాలని వరుసకు అత్త అయిన మస్తాన్‌బీని హత్య చేసి బంగారు ఆభరణాలు తీసుకెళ్లాడని ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి తెలిపారు. శనివారం సంగం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ వెల్లడించారు. తలుపూరుపాడు గ్రామానికి చెందిన అన్సర్‌బాషా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన అతను అప్పులపాలై ఎలాగైనా సమస్యల నుంచి బయటపడాలని నిర్ణయించుకున్నాడు. అదే గ్రామానికి చెందిన తన మేనమామ మస్తాన్‌సాహెబ్‌కు గత నెల 27వ తేదీ రాత్రి మద్యంలో మత్తు కలిపి తాగించాడు. అతనిని వరండాలో పడుకోబెట్టి పథకం ప్రకారం ఇంట్లో నిద్రిస్తున్న మస్తాన్‌సాహెబ్ భార్య మస్తాన్‌బీని దిండు ముఖంపై పెట్టి, గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె వద్దనున్న 8 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. మస్తాన్‌సాహెబ్ మనవడు బాబు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు శనివారం బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్ సెంటర్‌లో నిందితుడు అన్సర్‌బాషాను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా బంగారు ఆభరణాల కోసం తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఆభరణాలను రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని త్వరగా పట్టుకున్న సంగం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

సంక్షేమ పథకం.. మారిన జీవన పథం

• నెలకు రూ.30 వేలు ఆదాయం

సంగం: మహిళా ఆర్థిక స్వావలంబన నినాదం దశాబ్దాలుగా ప్రభుత్వాల ప్రచారంగా మిగిలిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అది ఆచరణ దిశగా అడుగులు వేసింది. సామాన్య మహిళలు చిరు వ్యాపారులుగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించిన ముఖ్యమంత్రి అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించారు. వివిధ పథకాల కింద ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాల డబ్బులు కుటుంబాల అవసరాలు, అప్పులు తీర్చుకునేందుకు వినియోగించకుండా ఆ పథకాల మొత్తానికి అదనంగా బ్యాంక్ రుణాలను అందించి వారి వ్యాపార ప్రారంభానికి బాసటగా నిలిచారు. గతంలో పొదుపు రుణాలు తీసుకున్నా.. ఇంటి అవసరాలకు వాడుకుని, తిరిగి నెలనెలా అప్పులు తెచ్చి కట్టుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు తీసుకున్న రుణాలతో చిన్నపాటి వ్యాపారం ప్రారంభించుకుని వచ్చే లాభాలతో కుటుంబ అవసరాలు, పొదుపు రుణాలు తీర్చుకుంటున్నారు.

గతంలో..

గతంలో ప్రభుత్వ పథకాలు ఏది పొందాలన్నా రోజుల తరబడి కాళ్లరిగేలా తిరగడం, నాయకులను ప్రసన్నం చేసుకునేందుకే కాలం సరిపోయేది. అయినా కూడా పథకాలు పూర్తి స్థాయిలో అందేవి కావు. దీంతో విసుగొచ్చేది. నాలుగేళ్ల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అనేక సంక్షేమ పథకాలను మహిళలకు దక్కేలా ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా ఆదుకున్నారు.



హైరర్స్ వ్యాపారం నిర్వహిస్తున్న కె ప్రసన్న

వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూతతో పాటు మరి కొన్ని పథకాల ద్వారా వచ్చే డబ్బులను ఆదా చేసుకుని ఈ విధంగా ఎదుగుతున్నారు. ఇటువంటి వారిలో సంగం మండలం జెండాదిబ్బకు చెందిన కె ప్రసన్నలక్ష్మి ఒకరు. జగనన్న పథకాలతో తన కుటుంబం బాగుపడిన తీరును ఆమె మాటల్లోనే..

హైరర్స్‌తో నెలకు రూ.30 వేల రాబడి

కుటుంబ పోషణ కష్టంగా ఉన్న మాకు ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుందని ఎదురు చూస్తున్న తరుణంలో పొదుపు ద్వారా స్త్రీనిధి రుణం రూ.50 వేలు, ముద్రా రుణం రూ.2 లక్షలు తీసుకుని చిన్నపాటి వ్యాపారం ప్రారంభించా. స్వీట్ స్టాల్ నిర్వహిస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాం. జగనన్న పొదుపు రుణ మాఫీతో వైఎస్సార్ ఆసరా ద్వారా నాకు రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలు నా వ్యక్తిగత ఖాతాలో జమ అయింది. ఫుడ్ ప్రాసెసింగ్ రుణం రూ.40 వేలు బ్యాంకు నుంచి తీసుకున్నాను. గత వ్యాపారాన్ని మానుకుని మొత్తం రూ.3.90 లక్షల నగదుతో హైరర్స్ వ్యాపారం ప్రారంభించాం. దీంతో మాకు ఆర్థిక ఇబ్బందులు తొలగాయి. ఇప్పుడు నెలకు సుమారు రూ.30 వేలు ఆదాయం వస్తోంది. మా కుటుంబ ఆర్థిక ఇబ్బందులు కేవలం జగనన్న పథకాలతోనే తీరాయి. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– కె ప్రసన్న, జెండాదిబ్బ, సంగం మండలం

రూ.5 కోట్లతో గౌతమ్ స్మృతివనం


కళాశాల డీన్ గోపీకృష్ణతో చర్చిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల వ్యయంతో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి స్మృతివనం ఏర్పాటు చేయనున్నట్లు ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం వ్యవసాయ కళాశాలతో పాటు స్మృతివనం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని కళాశాల యాజమాన్యం, నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉదయగిరి దుర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించానన్నారు. ఉదయగిరిలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుతో కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, కడప, తదితర జిల్లాల విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఈ కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ టి.గోపీకృష్ణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి బ్యాడ్మింటన్ క్రీడాకారులు


మంత్రి కాకాణి, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ నుంచి షీల్డ్, చెక్కు అందుకుంటున్న ఆత్మకూరు బ్యాడ్మింటన్ క్రీడాకారులు

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న క్రీడా సంబరాలు ఆడుదాం ఆంధ్రా ద్వారా పలువురు క్రీడాకారులు తమ సత్తా చాటుతున్నారు. ఆత్మకూరుకు చెందిన 22, 23 వార్డుల సచివాలయ పరిధిలోని బ్యాడ్మింటన్ క్రీడాకారులు కె.అశోక్, సీహెచ్ కార్తికేయ సచివాలయ పరిధిలో రెండు గేముల్లో, మండల స్థాయిలో 3 గేముల్లో, నియోజకవర్గ స్థాయిలో 3 గేముల్లో ఇటీవల జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొంది జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. అక్కడ సైతం తమ సత్తా చాటి 3 గేముల్లో ఆడి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీదుగా ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను అందుకున్నారు. మంత్రి కాకాణి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి క్రీడాకారులను అభినందించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత


19వ వార్డు పరిధిలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి, తదితరులు

ఆత్మకూరు: పట్టణ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఐదుగురు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.50 వేలు ఆర్థిక సాయం శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శనివారం అందజేశారు. 19వ వార్డు పరిధిలోని షేక్ మీరాంబీ, 22వ వార్డు పరిధి వీవర్స్ కాలనీలో గిరిజన మహిళ యాకసిరి పోలమ్మ, 5వ వార్డు పరిధిలోని చింతచెట్ల కాలనీకి చెందిన షేక్ నజీర్, రజకవీధికి చెందిన కామేపల్లి శ్రీరాములు, 16వ వార్డు పరిధిలోని సారాబీ, తదితరులు మృతి చెందారు. శనివారం ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆయా కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండా వెంకటేశ్వర్లు, 10వ వార్డు తుమ్మల త్రివేణి, కుడుముల సుధాకర్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్, అశోక్‌రెడ్డి, మహబూబ్ జానీ, వలంటీరు ఖాజామస్తాన్, మెప్మా ఆర్‌పీలు పద్మావతి, శిరీషా, దేవసేన, శాంతి, అఫ్రీన్, హాజీరా, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓకు ఘన సన్మానం


వీఆర్‌ఓను సన్మానిస్తున్న దృశ్యం

సంగం: సంగం బిట్-1 గ్రామ రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తూ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన రవిబాబును శనివారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సంగం తహసీల్దారు కార్యాలయం నుంచి ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి పదోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు అశోక్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అనంత విశ్వంపై అవగాహన పెంచుకోండి

• జేవీవీ నేత డాక్టర్ సుధాకర్ రెడ్డి


అనంత విశ్వం విశిష్టను వివరిస్తున్న డాక్టర్ సుధాకర్ రెడ్డి

ఆత్మకూరు: విశ్వం అంత సులభంగా అర్థమయ్యేది కాదని, ఈ అనంత విశ్వం గురించి భౌతికశాస్త్రం శాస్త్రవేత్తలు విశేష కృషి చేసి ఎన్నో రహస్యాలను మనకు అందించారని జనవిజ్ఞాన వేదిక నేత, ప్రముఖ వైద్యులు జి సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని పాఠశాలల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు జేవీవీ ఆధ్వర్యంలో అనంత విశ్వంపై బోధన, శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా బోధించేందుకు పలు మెళకువలను వివరించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ మూఢనమ్మకాలను విడనాడేలా రుజువులతో సహా విద్యార్థులకు వివరించాలని ఆయన తెలిపారు. పలు ఉదాహరణలను స్క్రీన్‌పై చూపి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ షేక్ నజీర్‌బాషా, జేవీవీ నాయకులు లక్కు ప్రసాద్, హరికృష్ణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గావ్ చలో విజయవంతం చేద్దాం


గావ్ చలో కార్యక్రమాన్ని వివరిస్తున్న బీజేపీ అధ్యక్షుడు సుధాకర్

ఆత్మకూరు: బీజేపీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు దేశ వ్యాప్తంగా నిర్వహించే గావ్ చలో (పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేసేందుకు బాధ్యత తీసుకోవాలని ఆ పార్టీ ఆత్మకూరు అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో శనివారం గావ్ చలో కార్యక్రమంపై పట్టణ, రూరల్ కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు పల్లెకు వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఆ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి స్పందన తెలుసుకుంటూ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వాసిపల్లి సుధాకర్ రెడ్డి, ఉప్పులూరి నరసింహులు, జి నరసింహారెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, కొల్లి శ్రీనివాసులునాయుడు, సంతోష్ కుమార్, ఓబుల్‌రెడ్డి, మధు, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నామని డాక్టర్ యశోధర పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పురమందిరంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. బృందావనంలో యశోధర హోమియో క్లినిక్‌ను ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, వెంకురెడ్డి, శరత్, నరసింహ పాల్గొన్నారు.